


# సంసారంలో సరిగమలు - తమస్విని



*(ప్రతి సంసారంలోనూ వినిపించే రాగాలు..*

*కొన్ని సరదాలు, కొన్ని సరాగాలు,*

*కొన్ని సరసాలు, ఇంకొన్ని విరసాలు, మరికొన్ని విషాద గీతాలు..*

*వెరసి సంసారంలో సరిగమలు..!)*

## మంచి పొరుగు

**పక్కింట్లోంచి** గిన్నెల చప్పుడు, పెద్ద పెద్ద అరుపులు వినపడగానే అరుణ్ దుప్పటిని చెవులమీదకి లాక్కుని విసుగ్గా చెప్పాడు.

"మహాతల్లి నోటికి శనాదివారాలు సెలవుకూడా లేదు. పొద్దున్నే మొదలు పెట్టింది. ఛీఛీ."

మొహానికి పాలు, శనగపిండి పేస్ట్‌ని పూస్తున్న సమన్విత కిలకిల నవ్వింది.

"నేనెంత మంచిదాన్నో ఆవిడ రోజూ గుర్తుచేస్తుంది కదా అరుణ్?"

"నువ్వు ఆవిడలా ఉంటే, ఏనాడో సన్యాసుల్లో కలిసిపోయేవాడిని." అరుణ్‌లేచి బాత్‌రూములోకి వెళ్ళాడు.

పక్కింట్లోని శబ్దాలు, కేకలు ఆగలేదు.

"రెండు చేతులు కలిస్తేనే చప్పట్లు అంటారు. ఈవిడ ఒక్కచేత్తోనే ఇంత శబ్దాన్ని సృష్టిస్తోంది" అరుణ్ టవల్‌తో మొహం తుడుచుకుంటూ చెప్పాడు.

"పాపం మానవుడు" సమన్విత సానుభూతిగా చెప్పింది.

ఆ మానవుడు రవిచంద్ర భార్య అరుపులని, గిన్నెల చప్పుళ్ళని నిశ్శబ్దంగా వింటూ ఆదివారం అనుబంధంలోని పజిల్ పూర్తిచేస్తున్నాడు. అతని మొహం నిర్విచారంగా ఉంది.

ప్రియంవద వంటింట్లోంచి వచ్చి అతని చేతిలోని పుస్తకాన్ని విసిరికొట్టి అరిచింది.

"పిచ్చిదానిలా వాగుతుందిలే అనుకుంటున్నావా? జవాబు చెప్పవేం?"

రవిచంద్ర ఆమెవైపు చూసాడు. వెలిసిపోయిన నైటీ, చింపిరి జుట్టు, మొహం కడుక్కునేప్పుడు చెదిరి ముక్కుమీదకి కారిన బొట్టు. ప్రియంవద అందమైన రాక్షసిలా ఉంది.

"ఏం చెప్పాలి?" శాంతంగా అడిగాడు.

"చేసేదంతా చేసి ఏం చెప్పాలిట! నాందేడ్‌కి ఎందుకు రావు?"

"నీకిష్టమైతే నువ్వు వెళ్ళు. నాకు ఇష్టంలేదు. బలవంతం చేయకు."

"ఎందుకిష్టంలేదు? మా బావ కలెక్టరని నీకు కుళ్ళు, అసూయ."

"అవును. అందుకే రాను" రవిచంద్ర లేచి గేట్ దగ్గర పడిన ఈనాడు ఆదివారం పుస్తకాన్ని తెచ్చి మళ్ళీ ఖాళీలు నింపసాగాడు.

ప్రియంవద ఉగ్రంగా దాన్నందుకుని చింపుతూ అరిచింది.

"మా నాన్నని అనాలి వెధవ పంతానికి పోయి నా గొంతు కోసాడు."

రవిచంద్ర లేచి దుస్తులు మార్చుకుని బయటకి వెళ్ళిపోయాడు.

"పొద్దున్నే ఏంటిట గొడవ?" అరుణ్ కాఫీ తాగుతూ అడిగాడు.

ప్రియంవద  బావ ఇంట్లో ఏదో ఫంక్షన్‌ట. నాందేడ్‌లో. అతను రానన్నట్లున్నాడు. అదీ గోల." నవ్వుతూ చెప్పింది.

"దానికంత రాద్ధాంతం ఎందుకు? తను వెళ్ళి రావచ్చుగా?"

"ఆ బావ మేనత్త కొడుకు. చిన్నప్పుడు వీళ్ళిద్దరికీ పెళ్ళి చేద్దాం అనుకున్నారట.  ప్రియంవద నాన్నకి చెల్లెలితో ఏవో గొడవలు వచ్చి కూతురికి ఈ రవిచంద్ర సంబంధం తెచ్చి చేసాడు. ఇతని దురదృష్టవశాత్తూ ఆ బావ ఐ.ఏ.ఎస్ ఆఫీసరయ్యాడు. దాంతో ప్రియంవదకి అసంతృప్తి. ప్రతీదానికి బావతో పోలుస్తుంది. మరి ఇతను వాళ్ళింటి ఫంక్షన్‌కి ఎలా వెళ్తాడు?" సమన్విత సానుభూతిగా చెప్పింది.

"నిజమే పాపం. రవిచంద్రది కూడా మంచి ఉద్యోగమేగా? తను కంపెనీ  సెక్రటరీ కోర్స్ చేసాడు."

"కానీ ఐ.ఎ.ఎస్‌కి ఉండే హోదా ఉండదుగా. ప్రియంవదకి వాళ్ళ నాన్నమీద కూడా కోపమే. ఆయన్ని అరుస్తుంది."

"హుమ్. ఒక్క మనిషి మూలంగా ఇంట్లో ఎంత అశాంతో, నయం పిల్లలు లేరు. ఉంటే పిచ్చెక్కిపోయేవాళ్ళు" అరుణ్ చెప్పాడు.

బయట గొడవ వినిపించడంతో సమన్విత చేతిలో పని ఆపేసి బయటకి పరిగెత్తుకొచ్చింది. ప్రియంవద డాలీ రెక్కపట్టుకుని ఈడ్చుకొస్తోంది.

"అయ్యయ్యో! ఏమైంది? ఏం చేసింది?" సమన్విత బాధగా, ఆగ్రహంగా వాళ్ళకి ఎదురెళ్ళింది.

ఏడుస్తున్న డాలీ ఏమీ చెప్పలేదుకాని వెనక వస్తున్న సన్నీ అరిచాడు.

"చెల్లి ఏం చేయలేదమ్మా, మేమిద్దరం ఆడుకుంటున్నాం. రోడ్డుమీద ఎవరో ఆడుకుంటూ విసిరిన రాయి వాళ్ళ వరండాలో పడిందిట. అది చెల్లి విసిరిందని ఈ ఆంటీ చెల్లిని కొట్టింది."

సమన్విత ఆగ్రహంతో ఊగిపోయింది.

"పిల్లని కొట్టే అధికారం మీకేముంది? కొట్టేముందు విచారించక్కర్లేదా? ఓసారి వీధిలో చూడండి ఎంతమంది ఆడుకుంటున్నారో. అయినా నా పిల్లలు రాళ్ళూ, రప్పలతో ఆడరు. ఇంకోసారి పిల్లల్ని ఏమన్నా అన్నారంటే ఊరుకునేది లేదు. దరిద్రపు పొరుగు. ఈ కొంప అమ్ముకుని పోతేకాని శాంతిలేదు" సమన్విత ఆమె చేతిని విదిలించి డాలీ కళ్ళు తుడిచి ముద్దుపెట్టుకుని ప్రియంవదతో చెప్పింది.

"మీకే అసంతృప్తులున్నా మీ ఆయనమీద చూపించుకోండి. ఇరుగు పొరుగు మీద కాదు. ఆ మహానుభావుడు ఊరుకుంటాడేమోకాని ఇక్కడ ఊరుకునేవారు ఎవరూ లేరు. ఇంకోసారి నా పిల్లల జోలికి వస్తే పోలీస్ రిపోర్ట్ ఇస్తా."

అరుణ్ ఇంటికి రాగానే జరిగింది చెప్పింది.

"మన పిల్లల్ని మనమే ఏనాడూ కొట్టలేదు. ఆవిడెవరు కొట్టడానికి?"అరుణ్ ఆవేశపడ్డాడు.

బెల్ మోగింది. సమన్విత వెళ్ళి తలుపు తెరిచింది. ఎదురుగా రవిచంద్ర. అతను తలవంచి నెమ్మదిగా చెప్పాడు.

"జరిగింది తెలిసింది. వెరీసారీ. నేను చెప్పినా వినదు. వాళ్ళ నాన్నకి ఫోన్ చేసి చెప్పాను. ఆయన వచ్చి తనకి నచ్చచెప్తానన్నాడు. ఇంకోసారి ఇలా జరక్కుండా ఆయన చూసుకుంటానన్నాడు.

మర్నాడు ఉదయం ఆరింటినించే పక్కింట్లో అరుపులు మొదలయ్యాయి.

"నువ్వెందుకు వచ్చావ్ నాన్నా? ఈ సి ఐ డి నీకు ఫోన్ చేసాడా? పనికిమాలిన దద్దమ్మ" ప్రియంవద అరుస్తోంది.

ఆయనేదో నచ్చచెప్పడానికి ప్రయిత్నిస్తున్నాడు. ఆయన కంఠం వినిపించడంలేదు.

"నాకు పిల్లలుంటేనా? ఈ దద్దమ్మని కట్టుకున్నాక పిల్లలు కూడా పుడతారా? వద్దు మొర్రో అంటే ఈ పెళ్ళి చేసావ్. నీకేం నువ్వు బానే ఉన్నావ్. నేను ఛస్తున్నాను. కాఫీ తాగి బయలుదేరు. ఈ చవటమాట వినకు బుద్దుంటే."

"అదేంటి వాళ్ళ నాన్నతో ఆ మాటలు?" అరుణ్ విస్తుబోయాడు.

"ఆవేశంలో తనకి విచక్షణ లేకుండా పోతోంది" సమన్విత చెప్పింది.

"అమ్మా ఆ అంకుల్ సాయంత్రంనుంచి వరండా మెట్లమీద కూర్చున్నాడే" సన్నీ తల్లితో చెప్పాడు.

"ఏ అంకుల్?" వాళ్ళకి అన్నం పెడుతూ అడిగింది సమన్విత.

"రవి అంకుల్. మేం ఆడుకునేప్పుడు చూసాం. ఇంటికి వచ్చి స్నానం చేసాం, హోం వర్క్ చేసాం. అన్నం తింటున్నాం. పాపం అక్కడే ఉన్నాడు."

సమన్విత బయటకి వచ్చి చూసింది. పక్కిల్లు చీకటిగా ఉంది. రవిచంద్ర మెట్లమీద కూర్చుని ఫోన్ చూసుకుంటున్నాడు. కేంప్‌నించి వచ్చినట్లున్నాడు. పక్కనే బ్రీఫ్‌కేస్ ఉంది.

తమ వరండా చివరికి వెళ్ళి అతన్ని పలకరించింది.

"తను లేరా ఇంట్లో."

"లేదండి. ఫోన్ కూడా రీచ్ అవడంలేదు" రవిచంద్ర చెప్పాడు.

"మీ దగ్గర డూప్లికేట్ కీ లేదా?"

"ఉంది. కాని తాళం మార్చినట్లుందండి."

సమన్వితకి జాలేసింది.

"మీరివాళ వస్తారని తనకి తెలీదేమో?"

"తెలుసండీ. నిన్న చెప్పాను" రవిచంద్ర నిస్సహాయంగా చెప్పాడు.

సమన్విత లోపలకి వెళ్ళి కాఫీ కలిపి సన్నీతో పంపించింది. అతను 'థాంక్స్' చెప్పి తీసుకున్నాడని సన్నీ చెప్పాడు.

సమన్విత మధ్య మధ్యలో చూస్తూనే ఉంది. చీకట్లో గోడకి అనుకుని కూర్చున్న రవిచంద్ర నీడ కనిపిస్తోంది. తాళం మార్చడం ఎందుకో సమన్వితకి అర్థం కాలేదు. ఫోన్ ఎందుకు ఆఫ్ చేసిందో కూడా.

"అదో పైశాచిక ఆనందం, నేను వెళ్ళి అతన్ని తీసుకొస్తా. మా ఇద్దరికీ వడ్డించు" అరుణ్ షర్ట్ తొడుక్కుంటూ చెప్పాడు.

రవిచంద్ర రాలేదు. 'నేను మీ ఇంట్లో ఉన్నప్పుడు ప్రియ వస్తే గొడవ చేస్తుందండి' అని చెప్పాడని అరుణ్ విసుక్కుంటూ చెప్పాడు.

"ఏమిటో ఈ గంగిగోవుకి ఆ మేనీటర్ దొరికింది.

రాత్రి పదిన్నరకి ప్రియంవద ఆటో దిగింది.

"మనం ఈ ఇల్లు అమ్మేసి ఎక్కడైనా ఇంకో ఇల్లు కొనుక్కుందాం అరుణ్" ఓ రోజు సమన్విత భర్తతో చెప్పింది.

"ఎందుకు?" అరుణ్ ఆశ్చర్యంగా అడిగాడు.

"పక్కింటావిడ గోల భరించలేకపోతున్నా."

"పిల్లల్ని మళ్ళీ ఏమైనా అందా?" అరుణ్ కోపంగా అడిగాడు.

"లేదు. కానీ మనింటికి వచ్చిన గెస్ట్‌లు, నా ఫ్రెండ్స్ ఆ అరుపులు విని ఆశ్చర్యపోతున్నారు. 'ఎలా భరిస్తున్నావ్?' అంటున్నారు."

అరుణ్ పకపకా నవ్వాడు.

"అందుకోసం ఇల్లమ్ముకుపోతారా?"

"మరి? ఆ ప్రియంవద నాన్న సిటీలో ఎక్కడా లేనట్లు మనింటిపక్క ఇల్లు కొనిపెట్టాడు కూతురికి" సమన్విత ఉక్రోషంగా చెప్పింది.

"ప్రాక్టికల్‌గా ఆలోచించు. ఎప్పుడో మా నాన్న ఈ స్థలం కొన్నారు కాబట్టి నేను ఇల్లు కట్టగలిగాను. ఇది అమ్మేస్తే ఇంత స్థలంతో, ఇంత పెద్దిల్లు కొనలేను. మనుషులు ఎప్పుడూ అలాగే ఉండరు. మారతారులే" అరుణ్ ఓదార్చాడు.

మధ్యాహ్నం భోజనం ముగించి, చదువుకోడానికి నవల తెరిచిన సమన్విత ఫోన్ మోగడంతో చూసింది. తన ఫ్రెండ్ అపూర్వ.

ఫోన్ ఆన్సర్ చేసి గబగబ చెప్పింది. "హలో అప్పూ ఎలా ఉన్నావ్? సారీనే రాలేకపోయాను. ఈ వీకెండ్ తప్పకుండా వస్తాం. నువ్వు యూ.ఎస్ ఎప్పుడు వెళ్తున్నావ్?"

"అమ్మగారు వచ్చేదాకా అమెరికా ఫ్లయిట్ ఆగుతుందా? నేను టూ వీక్స్ ఉన్నాకూడా తమరికి తీరికలేదు. నేను ఇవాళే వెళ్తున్నా" అపూర్వ నిష్టూరంగా చెప్పింది.

"అయ్యో! వెరీ సారీనే. పిల్లలకి నిన్నటిదాకా ఎగ్జామ్స్. అందుకే వరంగల్ రాలేకపోయా. అరుణ్ ఈ వీకెండ్ వెళ్దామన్నాడు" సమన్విత పశ్చాత్తాపంగా చెప్పింది.

నేనింకో అరగంటలో బయలుదేరతా. నా ఫ్లయిట్ తెల్లారుఝామున రెండుకి. అమ్మా నాన్నలని ఏర్‌పోర్ట్‌కి రావొద్దన్నాను. ఆ టైములో వాళ్ళు తిరిగి వరంగల్ వెళ్ళడం రిస్క్. నేను సాయంత్రం ఆరు ఏడుకల్లా ఏర్‌పోర్ట్‌కి చేరుకుంటాను. నీకు కుదిరితే వచ్చి కలుస్తావా? పది దాకా ఉండి వెళ్ళొచ్చు" అపూర్వ కోరింది.

"తప్పకుండా వస్తాను. ఇప్పుడే అరుణ్‌కి కాల్ చేస్తాను. తను పిల్లల్ని చూసుకుంటే, నేన్ కాబ్‌లో ఏర్‌పోర్ట్‌కి వస్తా" సమన్విత ఉత్సాహంగా చెప్పింది.

అరుణ్ అంగీకారంగా చెప్పాడు.

"అలాగే పదికల్లా నేను పిల్లలని తీసుకుని ఏర్‌పోర్ట్‌కి వస్తాను. కలిసి వచ్చేద్దాం."

సమన్విత ఆ సమాచారం అపూర్వకి చెప్పి, ఒక గంట విశ్రాంతిగా పుస్తకం చదువుకుని లేచి సాయంత్రపు వంటపని మొదలు పెట్టింది.

అరుణ్ సాయంత్రం త్వరగా ఐదున్నరకే ఇంటికి వచ్చాడు. అప్పటికే సమన్విత తయారై ఉంది.

"అరుణ్. వంట చేసి టేబుల్ మీద పెట్టాను. పిల్లలకి పెట్టి నువ్వు తినెయ్. టెన్‌కల్లా వచ్చేయండి" భర్తకి చెప్పి కేబ్ బుక్ చేసింది.

ఏర్‌పోర్ట్ పరిసరాల్లోకి వెళ్ళగానే అపూర్వకి ఫోన్ చేసింది.

"ఇప్పుడే వచ్చాను. నువ్వు కిందవున్న బర్గర్‌కింగ్‌కి రా. నేను లగేజ్‌తో అక్కడికి వెళ్తాను" అపూర్వ చెప్పింది.

బర్గర్‌కింగ్‌లో చాలామంది ఉన్నారు. ఓ మూల లగేజ్ ట్రాలీని పెట్టి పేపర్ నేప్కిన్‌తో కుర్చీని తుడుస్తున్న అపూర్వ కనిపించింది. ఆమె దగ్గరకి వెళ్ళి సంతోషంగా అరిచింది.

"అప్పూ"

అపూర్వ వెనక్కి తిరిగి స్నేహితురాలిని ఆలింగనం చేసుకుంది. కిండర్‌గార్డెన్‌నించి డిగ్రీ దాకా క్లాస్‌మేట్స్, గాఢ స్నేహితులు అయిన ఆ ఇద్దరూ పరిసరాలు మర్చిపోయి కబుర్లలో మునిగిపోయారు.

ఎనిమిదిన్నరకి అపూర్వ అత్తగారి తరపు బంధువులు ఏవో సామానుతో వచ్చారు. అపూర్వ వాళ్ళతో మాట్లాడుతూంటే, సమన్విత మౌనంగా వినసాగింది.

"దుబాయ్‌లో బర్గర్‌కింగ్ ఉంటుందా డాడీ?" వెనకనించి ఓ చిన్న పిల్ల మాటలు వినిపించాయి.

"ఒకటికాదు. చాలా ఉంటాయి. చాలా పెద్దవి" ఓ మగకంఠం చెప్తోంది.

ఆ కంఠ స్వరం విన్నట్లుగా ఉండి సమన్విత వెనక్కి తిరిగి చూసింది.

రవిచంద్ర! పక్కనే నాలుగైదేళ్ళ చిన్నపాప కూర్చుంది. ఎదురుగా దాదాపు తన వయసే ఉన్న అమ్మాయి కూర్చుని నవ్వుతూ చూస్తోంది.

తలతిప్పి వాళ్ళ మాటలు వినసాగింది.

"డాడీ దుబాయ్‌లో జెయింట్ వీల్ ఉంటుందా?" ఆ పాప మళ్ళీ అడిగింది.

"ఉంటుందమ్మా చాలా పేద్ద వీల్" పెకి దీర్ఘం ఇస్తూ చెప్పాడు.

"అమ్మా నాన్నని విసిగించకు. పగలంతా బోలెడు పనిచేసి వచ్చారు. మనం రెస్ట్ ఇవ్వాలి కదా?" ఆమె కూతురికి నచ్చచెప్తోంది.

"ప్రశ్నలు వేస్తేనే పిల్లల తెలివితేటలు ఇంప్రూవ్ అవుతాయి. మరేం పర్లేదు. నేనేం అలసిపోలేదు" రవిచంద్ర మృదువుగా చెప్పాడు.

సమన్వితకి ఏం జరుగుతోందో అర్థంకాలేదు. వాళ్ళు రవిచంద్ర భార్యా, కూతుళ్ళని తెలిసిపోతోంది. ఈ విషయం ప్రియంవదకి తెలిస్తే? ఆమె స్వల్పంగా వణికింది. అతను కేంప్స్ అని సగం రోజులు  అక్కడ గడుపుతున్నాడేమో! చిత్రంగా సమన్వితకి రవిచంద్ర మీద జాలేసింది.

పాపని బాత్‌రూంకి తీసుకెళ్ళడానికి లేచిన రవిచంద్ర తమవంకే చూస్తున్న సమన్వితని చూసి కంగారుపడ్డాడు. భార్యకి ఏదో చెప్పి, వాళ్ళతో బయటకి నడిచాడు. ఓ క్షణం మళ్ళీ లోపలకి వచ్చి సమన్వితకి రెండు చేతులు జోడించి నమస్కరించి వెనుతిరిగాడు.

అపూర్వ బంధువులతో బిజీగా ఉండడంతో భర్తకి ఫోన్ చేసింది.

"ఎక్కడున్నారు?"

"ఇంకో అరగంటలో ఉంటాం. పిల్లలు నిద్రపోయేలా ఉన్నారని ముందే బయలుదేరా" అరుణ్ చెప్పాడు.

"దగ్గరకి వచ్చాక ఫోన్ చేస్తే నేను వచ్చేస్తాను. పార్క్ చేయనక్కర్లేదు" చెప్పింది.

తర్వాత అపూర్వతో చెప్పింది.

"అరుణ్ వచ్చేస్తున్నాడు అప్పూ. వెళ్తాను."

"తీరిగ్గా మాట్లాడుకున్నట్లే లేదు. నువ్వు రావుకాని, ఈసారి ఇండియా ట్రిప్‌లో మీ ఇంట్లో ఒకరోజంతా ఉంటాను. బై బై." అపూర్వ స్నేహితురాలిని గాఢాలింగనం చేసుకుంది.

సమన్విత నెమ్మదిగా మెట్లెక్కి ఏర్‌పోర్ట్ ఎంట్రన్స్ దగ్గరకి చేరుకుంది. మరో పావుగంటలో అరుణ్ కారు ఆమె ముందు ఆగింది.

"పిల్లలు సగందూరం వచ్చేసరికే నిద్రపోయారు. ఏమంటోంది మీ దోస్త్?" అరుణ్ భార్యని అడిగాడు.

"నువ్వు నన్ను బాగా పేంపర్ చేస్తున్నావుట. అందుకని నేను అప్పటి సమన్వితలానే ఉన్నానుట. అసలు మెచూరిటీ రాలేదుట నాకు" సమన్విత నవ్వింది.

తర్వాత వెనక్కి తిరిగి నిద్రపోతున్న్న పిల్లల్ని చూసి చెప్పింది.

"నీకో ముఖ్యమైన విషయం చెప్పాలి అరుణ్..." రవిచంద్ర గురించి ఆమె చెప్తూంటే అరుణ్ ఆశ్చర్యంగా విన్నాడు.

"ఇలాంటిదేదో అవుతుందని అనుకుంటూనే ఉన్నాను. అంత గయ్యాళితో కాపురం చేయడం చాలా కష్టం" చెప్పాడు.

"పాపం. ప్రియంవద" సమన్విత జాలి పడింది.

"అందుకే నీ ఫ్రెండ్ నీకు మెచూరిటీ లేదని చెప్పింది. పగలంతా పనిచేసి సాయంత్రం ఇంటికి వచ్చిన వాడికి ఇంట్లో ఎలాంటి శాంతి కావాలి చెప్పు? ఆ సాధింపులు, ఆ అరుపులు హారిబుల్."

సమన్వితకి 'తండ్రిని విసిగించద్దన్న' రవిచంద్ర స్నేహితురాలు గుర్తొచ్చింది.

మర్నాడు సాయంత్రం మళ్ళీ రవిచంద్ర వచ్చే టైముకి ప్రియంవద ఇంట్లో లేదు.

"అమ్మా ఆ అంకుల్ వాళ్ళింటి మెట్లమీద కూర్చున్నారమ్మా. కాఫీ ఇస్తావా?" అలవాటైన సన్నీ అడిగాడు.

వాడితో వాటర్‌బాటిల్, కాఫీ పంపింది. రాత్రి పిల్లలకి అన్నం తినిపించేప్పుడు చూస్తే, చీకట్లో సిల్హౌట్ లా కూర్చుని ఉన్నాడు. ప్రియంవద రాత్రి తొమ్మిదికి వచ్చింది. పంతంగా ఆమె భర్త కేంప్‌నించి వచ్చేరోజు పుట్టింటికి వెళ్ళివస్తూంటుందని సమన్విత అప్పటికే గ్రహించింది.

అది ప్రియంవదకి భర్తమీద గల చులకన భావం అనిపించింది ఈసారి.

ఇరవైరోజుల తర్వాత రవిచంద్ర కేంప్‌నించి వచ్చే సమయానికి లేకుండా పోయిన ప్రియంవద తీరికగా రాత్రి పదింటికి ఇంటికి వచ్చింది. చీకట్లో మెట్లమీద కూర్చుని ఉండాల్సిన భర్త ఆమెకి లైట్ వేసినా కనబడలేదు. ఆగ్రహంతో ఊగిపోతూ అతనికి ఫోన్ చేసింది. నంబర్ పనిచేయడంలేదనే సందేశం వినిపించింది.

ఆ రాత్రి ఆ కాలనీలోని ఆ ఇంటి చుట్టుపక్కల వాళ్ళెవరికీ నిద్రపట్టలేదు. ప్రియంవద చేతనైనంత రాద్ధాంతం చేసి తెల్లారురఝామున ఎప్పుడో పడుకుంది. మర్నాడు పొద్దున్నే ఆమె అన్నయ్యా, నాన్నా వచ్చారు.

అన్నయ్య రవిచంద్ర ఆఫీస్‌కి వెళ్ళొచ్చి చెప్పాడు.

"పది రోజుల క్రితమే రిజైన్ చేసాడట. నెల రోజుల నోటీస్ కూడా ఇచ్చాడట."

"పది రోజుల క్రితం రిజైన్ చేస్తే మరి కేంప్?" ప్రియంవద నిర్ఘాంతపోయింది.

"నీ గోల భరించలేక పారిపోయి ఉంటాడు. లేదా ఎందులోనైనా దూకి ఉంటాడు" కోపంగా చెప్పాడు అన్నయ్య. మనిషి సహనాన్ని అంతగా పరీక్షించకూడదు. ఇంక ఏడువు."

రవిచంద్ర ఇంటికి తిరిగివస్తే తను ఉండకూడదన్న కోపంతో ప్రియంవద ఇల్లు ఖాళీచేసి పుట్టింటికి వెళ్ళిపోయింది. ఆ ఇంట్లోకి అద్దెకి వచ్చినవాళ్ళు సౌమ్యంగానే ఉండడంతో సమన్విత 'అమ్మయ్య' అనుకుంది.

రవిచంద్ర ఆ తల్లీ కూతుళ్ళతో దుబాయ్ వెళ్ళిపోయివుంటాడని ఆమె బలంగా నమ్మింది. కారణం రెస్టారెంట్‌లో ఆ పాప పదేపదే దుబాయ్ గురించి మాట్లాడటమే.

ఆ తర్వాత వాళ్ళు ప్రియంవద గురించి వినలేదు.

"నయం. నువ్వు ప్రియంవదకి రవిచంద్ర ఎఫైర్ గురించి చెప్పలేదు. అసలే నీకు మెచూరిటీ లేదు" అరుణ్ భార్యని ఆటపట్టిస్తూంటాడు.

"నేనెందుకు చెప్తాను? నేను మంచి నైబర్‌ని" సమన్విత నవ్వుతూ అంటుంది.

*(వచ్చే సంచికలో మరో సరిగమ)*

Click here to share your comments